ఆంధ్ర మహాసభ

అవిభక్త మద్రాస్ రాష్ట్రంలో తమకు జరుగుతున్న వివక్షను వ్యతిరేకిస్తూ ఆంధ్రుల్లో వచ్చిన చైతన్యానికి ప్రతీక 'ఆంధ్ర మహా సభ'. మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంత విస్తీర్ణం 58 శాతం వరకు ఉండేది. రాష్ట్ర జనాభాలో 40 శాతం వరకు తెలుగువారు ఉండేవారు. కానీ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్రులు వెనుకబడి ఉండటమే కాకుండా ప్రత్యేక గుర్తింపు కూడా పొందలేకపోయారు. ఉద్యోగాలు, విద్య, వ్యవసాయం, పరిశ్రమల్లో.. ఇలా ప్రతి చోటా ఆంధ్రుల పట్ల నిరాదరణ ఉండేది.

ఆంధ్రదేశంలోని గుంటూరు, మచిలీపట్నం, బాపట్ల, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని కళాశాలలు, ఉన్నత పాఠశాలలకు ప్రిన్స్‌పాల్స్‌గా ఆంధ్రేతరులు పని చేసేవారు. అన్ని పరిశ్రమలు మద్రాస్‌కే పరిమితమయ్యాయి. దీంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంలోనే తమకు న్యాయం జరుగుతుందని, తమ భాష, సంస్కృతి పరిరక్షణ సాధ్యమవుతుందని తెలుగువారు భావించడం వల్ల ఆంధ్రోద్యమం బయలుదేరింది.

ఆంధ్రోద్యమంలో ప్రథమ దశను భావనా దశగా, రెండో దశను ప్రచార దిశగా పేర్కొనవచ్చు.

1903-04 మధ్య గుంటూరులో యంగ్‌మెన్ లిటరరీ అసోసియేషన్ స్థాపితమైంది. జొన్నవిత్తుల గురునాథం ఇందులో ప్రధాన సభ్యులు. 1905లో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమం ఆంధ్రదేశంలో రాజకీయ చైతన్యానికి మరింత ఊతమిచ్చింది. 1911లో ఉన్నవ లక్ష్మీనారాయణ, జొన్నవిత్తుల గురునాథం సంయుక్తంగా మద్రాస్ రాష్ట్రం, నిజాం రాజ్యం, మైసూర్ సెంట్రల్ ప్రావిన్సస్‌లో ఉన్న తెలుగు ప్రజల మొత్తం ప్రాంతాన్ని ఒకే చిత్రపటంగా రూపొందించారు. తెలుగువారికి ప్రత్యేక పాలనా విభాగం ఉండాలన్న కోరిక మొట్టమొదటిసారి 1911, డిసెంబర్ 12న ఢిల్లీ దర్బారులో వ్యక్తమైంది. భాషా ప్రయుక్త రాష్ట్రాల భావనకు బీజం అప్పుడే పడింది.

1912, మేలో నిడవోలులో 21వ కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల సంయుక్త సమావేశాలు జరిగాయి. దీనికి వేమవరపు రామదాసు పంతులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో గుంటూరు ప్రతినిధులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ప్రస్తావన తీసుకురాగా గోదావరి జిల్లాల ప్రతినిధులు దాన్ని అవహేళన చేశారు. అలా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తీర్మానం ఆదరణ పొందలేకపోయినా గుంటూరు ప్రతినిధులు నిరుత్సాహపడలేదు. నిడదవోలు నుంచి తిరిగా రాగానే ఉన్నవ లక్ష్మీనారాయణ, గురునాథం, చల్లా శేషగిరిరావు, కొండా వెంకటప్పయ్య తదితరులు ఒక స్థాయీ సంఘాన్ని ఏర్పాటు చేశారు. కొండా వెంకటప్పయ్య దీనికి కార్యదర్శి. తొలుత న్యాపతి సుబ్బారావు వంటి వారు సైతం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర భావనను వ్యతిరేకించారు.

ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 'ఆంధ్ర మహా సభ' ఆవిర్భవించింది. దీని తొలి సమావేశాలు 1913, మే 20న గుంటూరు జిల్లా బాపట్లలో జరిగాయి. దీనికి మద్రాస్ శాసనమండలి సభ్యులు బయ్యా నృసింహేశ్వర శర్మ (బి.ఎన్.శర్మ) అధ్యక్షులు. ఆంధ్ర మహాసభకు సమాంతరంగా నిజాం సంస్థానంలో 'నిజాం ఆంధ్ర మహా సభ' నడిచింది.

రెండో ఆంధ్ర మహా సభ సమావేశాలు విజయవాడలో 1914, ఏప్రిల్‌లో జరిగాయి. న్యాపతి సుబ్బారావు అధ్యక్షులు. మూడో సభ సమావేశాలు విశాఖపట్నంలో 1915, మేలో జరిగాయి. పానగల్ రాజా పానుగంటి రామరాయణిం అధ్యక్షులు. అంతవరకు ప్రత్యేకాంధ్రకు వ్యతిరేకులైన పానగల్ రాజా ఈ సమావేశంలో అనుకూలురయ్యారు.

నాలుగో ఆంధ్ర మహాసభలు 1916, మేలో కాకినాడలో జరిగాయి. మోచర్ల రామచంద్రరావు అధ్యక్షులు. అయిదో ఆంధ్ర మహాసభలు 1917, జూన్‌లో నెల్లూరులో జరిగాయి. ఇక్కడ సర్కారు-రాయలసీమ జిల్లాల మధ్య గల అభిప్రాయ భేదాలు చాలా తీవ్రంగా బహిర్గతమైనాయి. దీనికి కొండా వెంకటప్పయ్య అధ్యక్షులు.

రాజ్యాంగ సంస్కరణల గురించి పరిశీలించడానికి వచ్చిన మాంటేగ్‌ను కలవాలని 1917, అక్టోబర్‌లో విజయవాడలో జరిగిన ప్రత్యేక ఆంధ్ర మహా సభ నిర్ణయించింది. 1917, డిసెంబర్ 17న న్యాపతి సుబ్బారావు ప్రతినిధి వర్గం మాంటెగ్‌ను కలిసి ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఆవశ్యకతను వివరించింది. కొండా వెంకటప్పయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, పట్టాభి సీతారామయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు తదితరులు ఈ ప్రతినిధి వర్గ సభ్యులు.

1918, ఫిబ్రవరిలో కేంద్ర శాసనసభలో బి.ఎన్.శర్మ ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. కానీ అది వీగిపోయింది. 1918లో కడపలో జరిగిన ఆంధ్ర మహాసభకు పట్టాభి రామారావు అధ్యక్షత వహించారు. మరోవైపు తెలంగాణాలో నిజాం ఆంధ్ర మహాసభ ముందుకు సాగి ప్రజల్లో చైతన్యానికి దోహద పడింది.

తొలి నిజాం ఆంధ్ర మహాసభ మెదక్ జిల్లా జోగిపేటలో 1930లో జరిగింది. సురవరం ప్రతాపరెడ్డి దీనికి అధ్యక్షులు. 'ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకమ్ము...' అనే గీతంతో సభలు ప్రారంభమయ్యాయి. ఆంధ్ర మహాసభతో పాటు మహిళాసభ కూడా అవతరించింది. నడింపల్లి సుందరమ్మ ఈ సభలకు అధ్యక్షత వహించారు.

రెండో నిజాం ఆంధ్ర మహా సభ 1932లో నల్గొండ జిల్లాలోని దేవరకొండలో బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలకు ప్రఖ్యాత సినీ దర్శకులు గూడవల్లి రామబ్రహ్మం హాజరయ్యారు. ఇక్కడి ఆంధ్ర మహిళా సభకు టి.వరలక్ష్మమ్మ అధ్యక్షత వహించారు.

మూడో ఆంధ్ర మహాసభ 1934లో ఖమ్మంలో జరిగింది. పులిజాల వెంకట రంగారావు అధ్యక్షులు. మహిళాసభకు ఎల్లాప్రగడ సీతాకుమారి అధ్యక్షత వహించారు. నాలుగో నిజాం ఆంధ్ర మహాసభలు 1935లో కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో జరిగాయి. దీనికి 'ఆంధ్ర పితా

మహ' మాడపాటి హనుమంతరావు అధ్యక్షత వహించగా, మహిళా సభలకు మాడపాటి మాణిక్యమ్మ అధ్యక్షురాలు. ఈ కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా వేములవాడ భీమకవినగర్‌ను నిర్మించారు.

అయిదో ఆంధ్ర మహాసభలు 1936లో షాద్‌నగర్‌లో జరిగాయి. కొండ వెంకట రంగారెడ్డి అధ్యక్షులు. మహిళా సభకు అనంత లక్ష్మి దేవి అధ్యక్షత వహించారు. 1937లో నిజామాబాద్‌లో జరిగిన ఆరో ఆంధ్ర మహాసభలకు మందుముల నరసింగరావు అధ్యక్షత వహించ గా, మహిళా సభకు నందగిరి ఇందిరాదేవి అధ్యక్షత వహించారు. ఒక జిల్లా కేంద్రంలో ఈ సభలు నిర్వహించడం ఇదే ప్రథమం. మందు ముల వారు రయ్యత్ పత్రిక సంపాదకులు. కాగా ఇందిరాదేవి తెలం గాణా తొలి కథా రచయిత్రి. నందగిరి వెంకటరావు, వి.వి.రాజు ఏర్పాటు చేసుకున్నారు.

1940లో హైదరాబాద్ సమీపంలోని మల్కాపురంలో జరిగిన ఏడో ఆంధ్ర మహా సభలకు మందుముల రామచంద్రరావు అధ్యక్షత వహించగా మహిళా సభకు యోగ్యశీలాదేవి అధ్యక్షురాలు. 1941లో చిలుకూరులో జరిగిన ఎనిమిదో సభలకు రావి నారాయణరెడ్డి అధ్య క్షత వహించగా మహిళా సభలకు రంగమ్మ ఓబులరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సభల నాటికి ఆంధ్ర మహా సభలో వామపక్ష నాయ కత్వం బలపడింది. ఆంధ్ర మహా సభ సభ్యత్వాన్ని ఒక రూపాయి నుంచి నాలుగు అణాలకు తగ్గించారు.

1942లో ధర్మవరం మహాసభలు మాదిరాజు రామ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. ఇక్కడి మహిళా సభలకు కూడా రంగమ్మ ఓబు ల్‌రెడ్డి అధ్యక్షురాలు. 1943లో పదో నిజాం ఆంధ్ర మహాసభలు హైద రాబాద్‌లో జరిగాయి. ఇక్కడే తొలిసారి ఆంధ్ర మహాసభ అధ్యక్ష పద వికి ఎన్నిక జరిగింది. కొండా వెంకట రంగారెడ్డి గెలిచి అధ్యక్షత వహిం చారు. మహిళా సభకు సీతాకుమారి అధ్యక్షత వహించారు.

1944లో పదకొండో మహాసభలు భువనగిరిలో జరిగాయి. రావి నారాయణ రెడ్డి అధ్యక్షులు. ప్రసిద్ధ వామపక్ష నేత చండ్ర రాజేశ్వర రావు ఈ సభల్లో పాల్గొన్నారు. ఆంధ్ర మహాసభ సభ్యత్వాన్ని నాలుగు అణాల నుంచి ఒక అణాకు తగ్గించారు. ఇక్కడి మహిళా సభకు సత్య వతీదేవి అధ్యక్షురాలు. ఇక్కడ ఆంధ్ర మహాసభ అతివాద, మితవాద వర్గాలుగా చీలిపోయింది.

1945లో అతివాదుల సభ ఖమ్మంలో, మితవాదుల సభ మడికొం డలో జరిగాయి. అతివాదులకు రావి నారాయణ రెడ్డి, మితవాదులకు మందుముల నరసింగరావు అధ్యక్షత వహించారు. ప్రసిద్ధ బుర్రకథ కళాకారుడు నాజర్ ఖమ్మం సభలకు హాజరయ్యారు.

1946లో మెదక్ జిల్లా కందిలో చివరి మితవాదుల ఆంధ్ర మహా సభ జరిగింది. తెలంగాణా సర్దార్ 'జమలాపురం కేశవరావు' అధ్యక్షులు. కరీంనగర్‌లో బద్ధం ఎల్లారెడ్డి అధ్యక్షతన అతివాదుల సభ జరిగింది. 1947 నాటికి ఆంధ్ర మహాసభ ఉనికి కోల్పోయింది.

ఆంధ్ర మహాసభ ఆవిర్భావం

సంస్థానంలోని తెలంగాణ ప్రాంత ప్రజల మధ్య విజయవంతంగా పనిచేసిన 'ఆంధ్ర జనసంఘం' పేరు మార్చుకుని 'నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ'గా అవతరించింది. 1930లో జోగిపేట (మెదక్ జిల్లా)లో మొదటి మహాసభను జరపాలని నిర్ణయించుకున్నారు. ఈ సభ నిర్వహించడానికి వీలులేకుండా నిజాం నవాబ్ ప్రభుత్వం 'ఫర్మాన్ గస్తీ నిషాన్-53'ను జారీ చేసింది. భావ ప్రకటనా స్వాతంత్ర్యంపై ఈ కొత్త నిబంధన మరిన్ని ఆంక్షలు విధించింది. అనేక బేరసారాల అనంతరం సభను నిర్వహించుకోవడానికి ప్రభుత్వం మూడు షరతులతో అనుమతించింది. సభకు అధ్యక్షత వహించేవారు గైర్-ముల్కీ అంటే రాష్ట్రేతరుడు కాకూడదు. సభలో చేసే ప్రసంగాలు ఇతర మత స్థుల భావాలను కించపరిచే విధంగా ఉండకూడదు. రాజకీయ సమస్యలపై చర్చలు నిర్వహించకూడదు. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన ఈ మహాసభ జరిగింది. మొత్తం 32 తీర్మానాలను ఆమోదించారు. ప్రజాస్వామ్య వ్యతిరేకమైన గస్తీనిషాన్-53 రద్దు చేయాలని, ప్రాథమిక విద్యను అమలు పరచాలని, ప్రయివేటు పాఠశాలల స్థాపనపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని, వితంతువుల వివాహాలు జరపాలని, బాల్య వివాహాలు, వెట్టిచాకిరీ, అస్పృశ్యతలను నిషేధించాలని, దేవాలయాల్లోకి హరిజనుల ప్రవేశానికి అనుమతించాలని, మద్యపాన నిషేధ చట్టం చేయాలని, వంతుల పద్ధతిని నిషేధించాలని అనేక తీర్మానాలను ఆమోదించారు. రైతాంగం ఎదుర్కొనే ఏ ఒక్క సమస్య చర్చకు రాలేదు. ఈ మహాసభతో పాటే ఆంధ్ర మహిళాసభ సమావేశాలు కూడా జరిగాయి. నడింపల్లి సుందరమ్మ ఈ సభకు అధ్యక్షత వహించారు. ఆంధ్ర మహిళాసభలు 1942 వరకు జరిగాయి.

రెండో ఆంధ్ర మహాసభలు 1931లో దేవరకొండలో జరిగాయి. బూర్గుల రామకృష్ణారావు దీనికి అధ్యక్షుడు. ఈ సభలో ప్రసంగాలన్నీ తెలుగులోనే జరిగాయి. మూడో ఆంధ్ర మహాసభ 1934లో ఖమ్మంలో పులిజాల రంగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభ నిర్వహణకు నిజాం అనుమతి పొందడానికి మూడు సంవత్సరాల సమయం పట్టింది. ఇక్కడ కూడా ప్రభుత్వ రాజకీయ, విద్యా విధానాలను గురించి చర్చించరాదన్న షరతులతో సభ జరుపుకోవడానికి అనుమతినిచ్చింది. అటువంటి చర్చలు జరుపబోమని సభా నిర్వాహకులు ప్రభుత్వానికి రెండువేల రూపాయల ధరావతు కట్టాల్సి వచ్చింది. షరతులు ఉల్లంఘిస్తే ధరావతు జప్తు అవుతుంది.

వర్తకులు, వ్యాపారస్తులు వసూలు చేసే ధర్మచందాల రుసుంను ఆయా ప్రాంత ప్రజల విద్యాభివృద్ధికి ఖర్చు చేయాలనే తీర్మానాన్ని సభ ఆమోదించింది. భువనగిరి తాలూకాలో యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆరుట్ల రామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో హరిజనులు ఆలయం ప్రవేశం చేశారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి భువనగిరి తాలూకాలోని పాములకుంట, జాల, కుర్రారం, నమిలె, బేగంపేట, రాజంపేట, నర్సాపురం, రేనుకుంట 30-35 గ్రామాలకు వెళ్లి నాలుగు వందల మంది హరిజనులను సమీకరించి తెలంగాణలో దేవాలయ ప్రవేశం చేయించిన మొట్టమొదటి సంఘసంస్కర్త.

ఆనాటి ఆంధ్ర మహాసభలో నవయువకులు రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, డాక్టర్ రాజబహద్దూర్ గౌడ్, ఆరుట్ల లక్ష్మీ నరసింహా రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర రావు, సర్వదేవభట్ల రామనాథం, పెరవల్లి వెంకటరమణ, ఆరుట్ల రామచంద్రారెడ్డి ఆంధ్ర మహాసభ వేదిక నుంచి ఉపన్యాసాలిచ్చి, తీర్మానాలు చేయించి, వాటిని కార్యరంగంలోకి తెచ్చి, తెలంగాణ ప్రజలను ఉత్తేజపరిచారు.

1930 నుంచి 1946 వరకు 13 ఆంధ్ర మహాసభలు జరిగాయి. తెలంగాణ ప్రాంతం జాతీయోద్యమంలో ఆంధ్ర మహాసభ ప్రధాన పాత్ర వహించింది. నాలుగో ఆంధ్ర మహాసభ 1935లో సిరిసిల్లలో మాడపాటి హన్మంతరావు అధ్యక్షతన జరిగింది. 5వ సభ షాద్‌నగర్‌లో, కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. 1941 నుంచి ఆంధ్ర మహాసభ వామపక్షాల చేతిలోకి వెళ్లింది. 6వ ఆంధ్ర మహాసభ నిజామాబాద్‌లో, 7వ ఆంధ్ర మహాసభ హైదరాబాద్ జిల్లా 'మల్కాపురం'లో ఎం. రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. నిజాం రాజ్యంలో రాజ్యాంగ సంస్కరణలు చేయాలని తీర్మానించారు. 8వ ఆంధ్ర మహాసభ హుజూర్‌నగర్ తాలూక చిలకూరులో 1941లో రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. 9వ సభ వరంగల్ జిల్లా ధర్మవరంలో 1942లో మదిరాజు రామకోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగింది. 1943లో 10వ ఆంధ్ర మహాసభ హైదరాబాద్‌లో జరిగింది. బద్దం ఎల్లారెడ్డి, కె.వి. రంగారెడ్డిల మధ్య అధ్యక్ష పదవికి పోటీ జరిగింది. అందులో కె.వి. రంగారెడ్డి విజయం సాధించారు. 11వ ఆంధ్ర మహాసభ 1944లో రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన భువనగిరిలో జరిగింది. 12వ సభ 1945లో ఖమ్మంలో జరిగింది. రావి నారాయణ రెడ్డి దీనికి అధ్యక్షుడు. ఈ సభకు సుమారు 40 వేల మంది హాజరయ్యారు. డిసెంబర్ 3, 1946లో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైంది. దీనితో ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు ఆగిపోయాయి. అతివాదులు-మితవాదులుగా కమ్యూనిస్టులు మారినా, నాయకులందరూ ఆంధ్ర మహాసభకు విశేష కృషి చేశారు.

ఆర్యసమాజం (1892)

హైదరాబాద్‌లో ఆర్యసమాజం శాఖను 1892లో స్వామి నిత్యానంద సరస్వతి స్థాపించారు. హైదరాబాద్ సంస్థానంలో పత్రికా-వాక్కు

సమావేశ, మతస్వాతంత్ర్యాలు లేవు. నిజాం తన నిరంకుశ ప్రభుత్వాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవడానికి, ముస్లింల సంఖ్యను పెంచుకోవడానికి మాతమార్పిడులకు పాల్పడ్డాడు. తెలంగాణ ప్రాంతంలో వెనకబడిన కులాలవారిని ముస్లిం మతంలోకి మార్చే ప్రక్రియకు బహదూర్ యార్‌జంగ్ నాయకత్వం వహించాడు. హిందూ మతాచారాలను, హిందూ సంస్కృతిని, హిందూ మతాన్ని నైజాం నవాబు పరిపాలన నాశనం చేయడానికి పూనుకుందని ఆర్యసమాజం ప్రచారకులు భావించారు. దేశంలోని భిన్న ప్రాంతాల నుంచి వచ్చిన ప్రచారకులు హైదరాబాద్‌లో నిజాం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను బహిరంగ సభల ద్వారా నిలదీశారు. ఆర్యసమాజ్ పండిట్ రామచాదర్‌దేపేల్వీ నాయకత్వంలో హైదరాబాద్‌లో అనేక సభలు జరిగాయి. నైజాం ప్రభుత్వం అనుసరించే ముస్లిం పక్షపాత విధానాలను ఆర్యసమాజం ధైర్యంగా ఎదుర్కొంది. పండిట్ నరేంద్రజీ, శంకర రెడ్డిలు సమాజానికి విశేష సేవలు చేశారు.

కేశవరావ్ కొరాట్కర్, దామోదర్ సత్-వాలేకర్, డాక్టర్ అఘోర నాథ ఛటోపాధ్యాయ వంటి హైదరాబాద్ నగర ప్రముఖులు ఆర్యసమాజానికి ప్రోత్సాహమిచ్చారు. తర్వాత కేశవరావ్ కొరాట్కర్ హైదరాబాద్ హైకోర్టు జడ్జీగా నియమితులయ్యారు. 1896లో ఆర్య సమాజంలో చేరారు. 1906లో కేశవరావ్ కొరాట్కర్, వామనరావు నాయక్, గణపతిరావ్ అర్దీకర్ హైదరాబాద్‌లో వివేకవర్ధినీ పాఠశాలను స్థాపించారు.

హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ -1938

భారత జాతీయ కాంగ్రెస్‌లాగా 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్'ను 1938లో హైదరాబాద్ సంస్థానంలో స్థాపించారు. సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని సాధించే లక్ష్యంతో రాజకీయ కార్యకలాపాలను చేపట్టేవిధంగా 1938లో తీవ్రంగా ప్రయత్నాలు జరిగాయి. 1938 జనవరి 9న హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌కు గోవిందరావు నానాల్ అధ్యక్షతన ఒక తాత్కాలిక కార్యవర్గాన్ని రూపొందించారు. రాష్ట్రస్థాయి మహాసభను 1938, సెప్టెంబరు 9న జరపాలని కార్యవర్గం నిర్ణయించింది. మహాసభ జరగడానికి రెండు రోజుల ముందు నిజాం ప్రభుత్వం స్టేట్ కాంగ్రెస్‌ను ప్రజారక్షణల నిబంధనల కింద నిషేధించింది. ఇది మతపరమైన సంస్థ అని, రాష్ట్రం వెలుపల సంస్థని ఆరోపిస్తూ నిషేధం విధించారు. పరిపాలనా వ్యవహారాల్లో ప్రజలకు ప్రమేయం ఉండాలని, పత్రికా స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛ, పౌరహక్కులు కాపాడాలని, మతవివక్ష లేకుండా ప్రతిభ ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు జరపడానికి పబ్లిక్ సర్వీసు కమీషన్‌ను నెలకొల్పాలని, పౌరులందరికీ సమాన హక్కులు - అధికారాలు ఉండాలని కోరడమే స్టేట్ కాంగ్రెస్ వారి నేరం. ఈ నిషేధాన్ని ఎత్తివేయాలని స్వామీ రామానందతీర్థ 1940లో వ్యక్తిగత సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ రాష్ట్ర చరిత్రలో 1938వ సంవత్సరం అతి ప్రధానమైంది. నిజాం భూభాగంలో మొట్టమొదటిసారిగా ప్రజలు రాజకీయ పోరాటానికి నాంది పలికిన సంవత్సరం.

హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ తరపున స్వామీ రామానంద తీర్థ, కె.వి. రంగారెడ్డి, కె.వి. నరసింహరావు, కాశీనాథరావు వైద్య, బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి, రామకృష్ణ దూత్, జనార్దన రావు దేశాయ్, డాక్టర్ మేల్కోటే, కాళోజీ నారాయణ రావు, పద్మజా నాయుడు మొదలైన నాయకులు అరెస్టయ్యారు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌పై నిజాం ప్రభుత్వం 1946 వరకూ నిషేధం కొనసాగించింది. 1946లో తెలంగాణలో కమ్యూనిస్టులు సాయుధ పోరాటం ప్రారంభించారు. నైజాం సంస్థానంలోని ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతీయ సంఘాలన్నీ స్టేట్ కాంగ్రెస్‌లో విలీనమయ్యాయి. 1947లో స్వామీ రామానంద తీర్థ అధ్యక్షతన మొదటి నిజాం స్టేట్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. 1946 వరకు స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం కొనసాగినా, వందేమాతరం లాంటి ఉద్యమాలు తెలంగాణ ప్రజలను విశేషంగా ప్రభావితం చేశాయి.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్‌ను నిజాం నవాబు ఏ సంవత్సరంలో నిషేధించాడు?

ఎ) 1938లో బి) 1939లో

సి) 1942లో డి) 1940లో

2. 'వందేమాతరం' గేయ రచయిత ఎవరు?

ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) అరవింద ఘోష్

సి) శరత్‌చంద్ర ఛటర్జీ డి) బంకించంద్ర ఛటర్జీ

జవాబులు	1	2
	A	D

తెలుగు భాషోద్యమం.. ఆంధ్ర మహాసభ

హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ చైతన్యానికి ముందే, సాహిత్య-సాంస్కృతిక రంగాలలో పునర్వికాసం మొదలైంది. మొట్టమొదట తెలుగు ప్రజలలో ప్రారంభమైన ఈ ఉద్యమం క్రమంగా మరాఠీ, కన్నడ భాషా ప్రాంతాలకు కూడా విస్తరించింది.

తెలుగు, మరాఠీ, కన్నడ భాషలు మాట్లాడే ప్రజల నోరు నొక్కడానికి నిజాం ప్రభుత్వ వ్యూహం ప్రకారం ఒక విధానాన్ని రూపొందించింది. ప్రాంతీయ భాష మాధ్యమంగా విద్యాబోధన చేసే పాఠశాలకు, విద్యాసంస్థలకు అనుమతి నిరాకరించేవారు. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ ఉర్దూభాష మాత్రమే ఏకైక బోధనా భాషగా ఉండేది. విద్యార్థులందరూ ఉర్దూభాషను విధిగా నేర్చుకోవాల్సి వచ్చేది. తెలుగు, మరాఠీ, కన్నడ భాషలను ఉన్నత పాఠశాల స్థాయిలో ఐచ్ఛిక భాషలుగా నేర్చుకోవడానికి అవకాశం ఉండేది. ప్రజలలో అక్షరాస్యతా వ్యాప్తి అతితక్కువ. ప్రాథమిక, ఇతర పాఠశాలల సంఖ్య మరీ తక్కువ. ఇలాంటి సమయంలో 1901లో హైదరాబాద్‌లో, రావిచెట్టు రంగారావు, మునగాల రాజా ప్రోద్బలంతో 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం' అనే గ్రంథాలయాన్ని కొమర్రాజు వెంకట లక్ష్మణరావు స్థాపించారు. తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదట నెలకొల్పిన గ్రంథాలయంగా ఖ్యాతికెక్కింది. తెలంగాణ ప్రజల పునర్వికాసంలో ఈ గ్రంథాలయం ప్రముఖపాత్ర పోషించింది. చివరకు 1953లో ఆంధ్ర రాష్ట్రావతరణకు, తర్వాత తెలుగు మాట్లాడే ప్రజలందరినీ ఏకంచేసి 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణకు దోహదం చేసింది. దీంతోపాటు మరో రెండు తెలుగు గ్రంథాలయాలను కూడా స్థాపించారు. లక్ష్మణరావు కృషి ఫలితంగా 1904లో హన్మకొండలో 'శ్రీ రాజరాజ నరేంద్ర భాషానిలయం', 1905లో సికింద్రాబాద్‌లో 'ఆంధ్ర సంవర్ధినీ నిలయం' గ్రంథాలయాలు నెలకొల్పారు. 1906లో హైదరాబాద్‌లో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి' అనే ప్రచురణ సంస్థను స్థాపించారు. నిజాం నవాబు చంద్రికా గ్రంథమండలిని నిషేధిస్తాడేమోనని భావించి 1908లో దీన్ని మద్రాసుకు తరలించారు. లక్ష్మణరావు తెలుగు భాష పునర్వికాసానికి, ఆంధ్రా-తెలంగాణ ప్రజల మధ్య సాంస్కృతిక సంబంధాలకు వారధిగా నిలిచాడు. 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి' ద్వారా 'ఆంధ్రరాష్ట్ర ప్రశంస', 'నిజాం రాష్ట్ర ఆంధ్రులు', 'ప్రగతి మార్గాలు', 'వర్తక స్వాతంత్ర్యం' వంటి పుస్తకాలను ప్రచురించారు. నిజాం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజకీయ సంస్కరణల విషయంలో 'అరవముద అయ్యంగార్ కమిషన్' నివేదికను వెల్దుర్తి మాణిక్యరావు, కె.సి. గుప్తా ఆధ్వర్యంలోని 'అణాగ్రంథమాల' ప్రచురించింది. రాజకీయ సంస్కరణల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించడానికి అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ప్రధానమంత్రి 'సర్ అక్బర్ హైదరీ' 1937లో 'అరవముద అయ్యంగార్' కమిషన్‌ను నియమించారు. ఆ నివేదికను హిందువులతో పాటు ముస్లింలూ వ్యతిరేకించారు.

పుస్తకాల ప్రచురణ ద్వారా తెలంగాణలో జన జాగృతి కలిగించిన మరో మహానుభావుడు వట్టికోట అళ్వారు స్వామి. 'దేశోద్ధారక గ్రంథమాల'ను స్థాపించి అనేక పుస్తకాలను ప్రచురించారు. మహాత్మా గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వి.డి. సావర్కర్ మొదలైన దేశనాయకుల జీవిత చరిత్రలను కె. రంగదాసు, వట్టికోట అళ్వారు స్వామి రచించగా, కె.సి. గుప్తా ప్రచురించారు.

సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ దినపత్రిక తెలంగాణ ప్రజలలో రాజకీయ చైతన్యం కలిగించడానికి, జాతీయ భావాలను ప్రచారం చేయడానికి అనేక విధాలుగా దోహదపడింది. 1934లో హైదరాబాద్ నుంచి 'గోల్కొండ కవుల' సంచిక వెలువడింది.

ఆంధ్ర జనసంఘం- ఆవిర్భావం (1921)

1905 'వందేమాతరం' ఉద్యమం నాటికి మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న ఆంధ్రులు రాజకీయంగా ముందంజలో ఉన్నారు. తెలంగాణ ప్రజలు హైదరాబాద్ రాష్ట్రంలో వెనకబడి ఉన్నారు. 1920 నాటికి గానీ తెలంగాణ ప్రజలలో రాజకీయ చైతన్యం రాలేదు.

నిజాం నవాబు ఉర్దూను అధికార భాషగా ప్రకటించి, కేవలం దాని అభివృద్ధికే కృషిచేశారు. మిగతా ప్రాంతీయ భాషలను అణగదొక్కడానికి ప్రయత్నించారు. ఒకపక్క ప్రభుత్వ నిరాదరణతో పాటు, సాటివారైన మహారాష్ట్రీయుల అవహేళన కారణంగా హైదరాబాద్ నగరంలో తెలుగు భాషా ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. ఈ ఉద్యమం జరగడానికి కారణమైన ప్రధాన సంఘటన.. 1921 నవంబరు 11-12 తేదీలలో హైదరాబాద్ వివేకవర్ధినీ థియేటర్‌లో పుణె మహిళా విశ్వవిద్యాలయ స్థాపకుడు 'మహర్షి కార్వే పండితును' అధ్యక్షతన జరిగిన 'నిజాం రాష్ట్ర హిందూ సాంఘిక సభ' ఆంధ్ర జనసంఘం ఆవిర్భావానికి కారణమైంది. సభా కార్యక్రమాలన్నీ ఉర్దూ, మరాఠీ, ఆంగ్లభాషలోనే జరిగాయి. ఈ సభలో ప్రతినిధిగా పాల్గొన్న హైదరాబాద్ న్యాయవాది 'ఆలంపల్లి వెంకట రామారావు' తెలుగులో ప్రసంగించడానికి ప్రయత్నించగా ఆయనను మాట్లాడకుండా హేళన చేశారు. ఆ రోజులలో తెలుగువారి సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ సభా కార్యక్రమాలు మాత్రం మరాఠీ, ఉర్దూ, ఆంగ్లంలోనే జరిగాయి. ఆనాడు తెలుగు వారికి, తెలుగు భాషకు జరిగిన అవమానానికి కోపగించిన తెలుగు జాతి సభను బహిష్కరించింది. నగరంలో తెలుగు సంస్కృతికి సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో తెలుగువారంతా కలిసి

'ఆంధ్ర జనసంఘానికి' అంకురార్పణ చేశారు. ఇందులో సుమారు వందమంది సభ్యులు చేరగానే కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించి నియమావళి ఆమోదించారు. మాడపాటి హన్మంత రావు కార్యదర్శిగా ఉండేవారు. బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు సభ్యులుగా చేరారు. 'ఆంధ్ర జనసంఘం' మొట్టమొదటి సదస్సు హైదరాబాద్‌లో 1922, ఫిబ్రవరి 14న నిర్వహించారు. కొండా వెంకట రంగారెడ్డి ప్రథమ అధ్యక్షుడు. 1921లో పుట్టిన ఆంధ్ర జనసంఘం పేరును 1922లో 'నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ'గా మార్చారు. దీనికి కార్యదర్శి మాడపాటి హన్మంతరావు. 'ఆంధ్ర జనసంఘం' వెట్టిచాకిరీ నిర్మూలనకు గణనీయమైన కృషిచేసింది. తమ తమ ప్రాంతాలకు నిజాం ప్రభుత్వాధికారులు వచ్చినపుడు ఆ ప్రాంతంలోని వర్తకుల నుంచి బలవంతంగా సొమ్ము వసూలు చేసి, అధికారులకు విందు-వినోదాలు ఏర్పాటు చేస్తుంటారు. ఆ రకమైన బలవంతపు వసూళ్లకు వ్యతిరేకంగా, వర్తక సంఘాలను స్థాపించేందుకు ఆంధ్ర జనసంఘం కృషిచేసింది. ఈ సంస్థ పోరాటాల ఫలితంగా వెట్టిచాకిరీని నిషేధిస్తూ 1923, 1926, 1927 సంవత్సరాలలో ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఆంధ్రోద్యమ పితామహుడుగా మాడపాటి హన్మంతరావు పేరుగాంచారు. హైదరాబాద్ ప్రజల సాంఘిక, సాంస్కృతిక వికాసాల కోసం కృషిచేయడం వరకే ఆంధ్ర జనసంఘం ఉద్యమం పరిమితమైంది. కొంత కాలానికి హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో విలీనమైంది.

సమావేశాలపై నిషేధం:

రాజ్యాంగ సవరణలను కోరుతూ 1921లో హైదరాబాద్‌కు చెందిన విద్యావంతులైన యువకులు ఒక రాజకీయ సభ నిర్వహణకు సంకల్పించారు. అన్నిరకాల బహిరంగ సభలను నిషేధిస్తూ 1921 సెప్టెంబరు 9న నిజాం నవాబు అసాధారణ గెజెట్ ప్రకటన చేశారు.'బాబె హుకుమత్' అంటే, నిజాం మంత్రివర్గం నుంచి ముందుగా అనుమతి పొందకుండా ఎటువంటి బహిరంగ సభ నిర్వహణకు వీలులేదని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. దీనిని 'కాలాగష్తి' అని పిలిచేవారు. ఇది కనీస పౌరహక్కుల్ని హరించింది. దీనికి వ్యతిరేకంగా ప్రజాసంస్థలు, తిరుగుబాటు చేశాయి.

ప్రాక్టీస్ ప్రశ్నలు..

1.'గోల్కొండ కవుల సంచిక' హైదరాబాద్ నుంచి ఏ సంవత్సరంలో విడుదలైంది?

ఎ) 1934 బి) 1930 సి) 1926 డి) 1929

2.'గోల్కొండ పత్రిక' సంపాదకుడు ఎవరు?

ఎ) అడవి బాపిరాజు బి) తాపీ ధర్మారావు
సి) దాశరథి రంగాచార్య డి) సురవరం ప్రతాపరెడ్డి

3.'నిజాం రాష్ట్ర హిందూ సాంఘిక సభ' అధ్యక్షుడెవరు?

ఎ) మహర్షి కార్వే పండితుడు
బి) కేల్కర్ సి) ఆలంపల్లి వెంకట రామారావు
డి) కొండా వెంకట రంగారెడ్డి

4.'ఆంధ్ర జన సంఘం' ఎప్పుడు ఆవిర్భవించింది?

ఎ) 1921 బి) 1920 సి) 1919 డి) 1918

5.'ఆంధ్ర జన సంఘం' పేరును 'నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభగా' ఎప్పుడు మార్చారు?

ఎ) 1900 బి) 1921 సి) 1924 డి) 1922

6.ఆంధ్ర జనకేంద్ర సంఘాన్ని ఎప్పుడు ప్రారంభించారు?

ఎ) 1923 బి) 1920 సి) 1921 డి) 1925

7.1922లో ప్రారంభించిన 'నీలగిరి' పత్రిక వ్యవస్థాపకుడెవరు?

ఎ) బుద్ధిరాజు సీతారామచంద్రరావు
బి) సబ్నవీసు వెంకట రామ నరసింహారావు
సి) సురవరం ప్రతాపరెడ్డి
డి) అడవి బాపిరాజు

8.'హిందువుల పండగలు' అనే గ్రంథ రచయిత?

ఎ) చిలుకూరి వీరభద్రరావు బి) ఖండవల్లి లక్ష్మీ రంజనం
సి) సురవరం ప్రతాపరెడ్డి
డి) మల్లంపల్లి సోమశేఖర శర్మ

9.1923లో కాకినాడలో జరిగిన 'భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు ఎవరు అధ్యక్షుడుగా వ్యవహరించారు?

ఎ) స్వామీ రామానంద తీర్థ
బి) కె.వి. రంగారెడ్డి సి) రావి నారాయణ రెడ్డి
డి) మౌలానా మహమ్మదాలీ

జవాబులు	1	2	3	4	5	6	7	8	9
	A	D	A	A	D	A	B	C	D